క్లుప్తంగా

నిధులు కేటాయించాలని వినతి



ఎమ్మెల్యే సబితారెడ్డికి సమస్యలు వివరిస్తున్న గ్రామస్తులు

కందుకూరు: మండల పరిధిలోని అగర్‌మియా గూడ గ్రామస్తులు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. గ్రామంలోని సీసీరోడ్లు, శ్మశానవాటికలో బోరు ఏర్పాటుకు రూ.20 లక్షల నిధులు మంజూరు చేయాలని ఆమెను కోరినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వి.రేవంత్‌రెడ్డి, స్థానిక నాయకులు ఎల్.జంగారెడ్డి, ఈ.వెంకట్‌రెడ్డి, ఎ.పెద్దిరాజు, వి.సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాములోరి ధనస్సు-విల్లుకు ప్రత్యేక పూజలు



రాములోరి ధనస్సు-విల్లును దర్శించుకుంటున్న భక్తులు

మీర్‌పేట: భక్తుల సందర్శనార్థం అయోధ్య రాములోరి కోసం నగరానికి చెందిన భక్తుడు చల్లా శ్రీనివాసశర్మ చేయించిన వెండి ధనస్సు-విల్లు శుక్రవారం రాత్రి మీర్‌పేట శివసాయినగర్‌లోని గౌరీ నీలకంఠేశ్వరస్వామి దేవాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ధనస్సు-విల్లుకు ప్రత్యేక పూజలు చేయగా, స్థానికంగా ఉన్న భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నట్లు ఆలయ చైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సంతోష్‌రెడ్డి, వెంకట కృష్ణారావు, వెంకటరమణ, బాపిరాజు ఉన్నారు.

సీపీఎం కమిటీ ఎన్నిక



నూతన కమిటీతో నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని ఆకులమైలారంలో సీపీఎం గ్రామ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ పార్టీ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్న కమిటీని మండల కమిటీ సభ్యుడు నోముల నర్సింహ ఆదివారం ప్రకటించారు. గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా ఆనెమోని భరత్, సహాయ కార్యదర్శిగా రావుల జంగయ్య, సభ్యులుగా రావుల ఐలమ్మ, నోముల అంజమ్మ, గుండు మౌనిక, గుండెల వనజ, అర్చన, మధుకర్, కదారి శివకుమార్, కోల్కం నగేశ్‌లను ఎన్నుకున్నామన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా కృషిచేయాలని ఈ సందర్భంగా మండల కార్యదర్శి బాల్‌రాజ్ సూచించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మొగిలిగిద్ద గ్రామస్తులు

పాఠశాల 150 ఏళ్ల ఉత్సవాలకు ఆహ్వానం

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామస్తులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదివారం కలిశారు. ప్రొఫెసర్ హరగోపాల్ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలిసి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రారంభించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించే ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ నెల 31న మొగిలిగిద్దకు వచ్చేందుకు సీఎం హామీ ఇచ్చినట్లు ప్రొఫెసర్ హరగోపాల్ తెలిపారు. సీఎంను కలిసిన వారిలో డాక్టర్ రవీందర్‌రెడ్డి, మల్లికార్జునప్ప, దయాసాగర్, అమృత్‌సాగర్, భవానీ శంకర్, రాకల మల్లేశ్ తదితరులు ఉన్నారు.

కార్మికుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

కడ్తాల్: కార్మికుల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు చల్లా సురేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వంపుగూడలో ఆదివారం భవన నిర్మాణ కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 12 రకాల టెస్టులు చేసి, రిపోర్టులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లేబర్‌కార్డు, బీమా ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, వాటిని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అశోక్, కార్మికులు కృష్ణయ్య, రాములు, జంగయ్య, యాదయ్య, చెన్నమ్మ, రాములమ్మ, మౌనిక, లక్ష్మీ, పూజ, రాధిక, లక్ష్మమ్మ, శారద ఉన్నారు.



మహేశ్వరం: మన్సాన్‌పల్లి చౌరస్తాలో వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, నాయకులు



మీర్‌పేటలో.. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి తదితరులు

ఆదర్శప్రాయుడు.. స్వామి వివేకానంద

స్వామి వివేకానందుడి బోధనలు, సూక్తులు నేటి యువతకు ఆదర్శమని పలువురు పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో వివేకానంద జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ప్రపంచ వేదికలపై సనాతన ధర్మాన్ని ఎలుగెత్తి చాటి, ప్రచారం చేసిన గొప్ప వ్యక్తి అని, ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు.



బడంగ్‌పేట్: అల్మాస్‌గూడలో..



కందుకూరు చౌరస్తాలో..



మీర్‌పేట: జిల్లెలగూడలో..



కందుకూరు: దెబ్బడగూడలో..



పహాడీషరీఫ్: మామిడిపల్లిలో..

క్రీడలతో మానసికోల్లాసం

మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

మహేశ్వరం: క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసికోల్లాసం పెంపొందుతుందని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పెండ్యాల ఉన్నత పాఠశాల ఆవరణలో మదీలవర్ధం ప్రేమలమ్మ, శ్రీలక్ష్మ్యారా నారాయణరెడ్డిల జ్ఞాపకార్థం వారి కుమారులు జగన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి ఆర్థిక సౌజన్యంతో నవభారత్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 28వ కబడ్డీ చాలెంజ్ కప్–2025 పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను కేఎల్లార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు. పెండ్యాలలో ప్రతి సంవత్సరం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యూత్ బజాన్ స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత పయనించాలని కోరారు. దేశ అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి, జెండాను ఆవిష్కరించి టాస్ వేసి కబడ్డీ పోటీలను వారు ప్రారంభించారు. మొత్తం 56 జట్లకుపైగా పోటీల్లో పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, కబడ్డీ పోటీల నిర్వాహకులు కాంగ్రెస్ నాయకులు మదీలవర్ధం మహేందర్‌రెడ్డి, శ్రీలక్ష్మ్యారా రాజశేఖర్‌రెడ్డి, నవభారత్ యూత్ క్లబ్ అధ్యక్షుడు అయిల్ల కుమార్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు జే.ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు యాదగిరి జంగయ్య, మాజీ సర్పంచ్‌లు అయిల్ల యాదయ్యగౌడ్, మంత్రి సుందర్‌రాజేష్, శ్రీలక్ష్మ్యారా జగన్‌మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, నరేందర్‌రెడ్డి, మంత్రి అంజయ్య, మంత్రి బాల్‌రాజ్, మద్ది కరుణాకర్‌రెడ్డి, యాదిశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు సరికాదు



పోలీస్‌స్టేషన్ వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నాయకులు

మీర్‌పేట: దాడులకు పాల్పడిన వారిని కాకుండా ప్రశ్నించే వారిని అరెస్టులు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ మీర్‌పేట అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి అన్నారు. భువనగిరిలో బీఆర్‌ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడికి నిరసనగా బీఆర్‌ఎస్ అధిష్ఠానం చలో భువనగిరికి పిలుపునిచ్చిన సందర్భంగా మీర్‌పేట పోలీసులు ఆదివారం ఉదయం బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కామేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ పరిపాలనలో ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని, కార్యాలయంపై దాడి చేసి ఫర్నీచర్‌ను ధ్వంసం చేయడంతో పాటు రాష్ట్రాన్ని సాధించిన నాయకుడి ఫొటోను పగులగొట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్ట్ అయిన వారిలో పార్టీ బడంగ్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రామిరెడ్డి, బీమిడి జంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వినాక్ ఉన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న మేయర్ పారిజాత, హాజరైన కార్పొరేటర్లు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో ఆదివారం ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అధ్యక్షతన కమిషనర్ వి.సరస్వతి ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రైతు భరోసా, భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జారీ పథకాలపై చర్చించారు. ఈ నెల 16 నుంచి 25 వరకు మున్సిపాలిటీలో వార్డు సభలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని మేయర్ పారిజాత తెలిపారు. నిజమైన అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను కార్పొరేటర్లను కోరారు. ఈ అవగాహన సదస్సులో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, 32 మంది వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

కలుష్య రహిత పోస్టర్ ఆవిష్కరణ

కలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విడుదల చేసిన వాల్‌పోస్టర్‌ను మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ సరస్వతి, కార్పొరేటర్లు కార్పొరేషన్ ఆవరణలో ఆవిష్కరించారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లలో రోడ్ల పక్కన, బహిరంగ ప్రదేశాలలో చెత్త పారవేయడం కానీ, కాల్చడం కానీ చేస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.5వేల జరిమానాతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మేనేజర్ బి.నాగేశ్వర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వి.యాదగిరి, డీఈఈలు యాదయ్య, జ్యోతిరెడ్డి, ఏఈలు వినీల్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె..

- రేపటి నుంచి వేంకటేశ్వరస్వామి దేవాలయ ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



కొలువైన స్వామివారు

కొందుర్గు: మండలంలోని సంజీవపురం చింతల్ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఇందుకుగాను ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రతి ఏటా సంక్రాంతి పండుగ సమయంలో బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. ఈ సంవత్సరం కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ దేవాలయం మండలంలోని విశ్వనాథ్‌పూర్, వెంకిర్యాల, లక్ష్మీదేవిపల్లి సమీపంలో ఉండటంతో మూడు గ్రామాల ప్రజలు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

రోజువారీ పూజా కార్యక్రమాలు..

ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 14న ధ్వజారోహణం, గణపతి హోమం, శకటోత్సవం, రాత్రికి భజనలు, 15న స్వామివారి అభిషేకం, 16న రథోత్సవం, పల్లకీసేవ, అదేవిధంగా దేవాలయ ఆవరణలో వెలసిన మైసమ్మ దేవతకు బండ్లు, బోనాల కార్యక్రమం ఉంటుంది. 17న స్వామివారి కల్యాణం, భజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, ప్రతాప్‌రెడ్డి, బక్కని నర్సింహులు వివిధ పార్టీల ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.



ముస్తాబైన వేంకటేశ్వరస్వామి దేవాలయం

బీఆర్‌ఎస్ నేతల ముందస్తు అరెస్టు

హస్తినాపురం: యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నేతలు చేసిన దాడికి నిరసనగా ఆదివారం భువనగిరి బంద్‌కు పిలుపునివ్వడంతో ఈ ప్రాంతానికి తరలి వెళ్తున్న బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని అరెస్ట్ చేసి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పైళ్ల శేఖర్‌రెడ్డి, భువనగిరి ఎంపీగా పోటీ చేసిన క్యామ మల్లేశ్‌తో పాటు 50 మంది బీఆర్‌ఎస్ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారి సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు పోలీసులు తెలిపారు.

అష్టలక్ష్మి దేవాలయంలో ప్రత్యేక పూజలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ అష్టలక్ష్మి దేవాలయంలో ధనుర్మాస పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామికి ప్రత్యేక పూజలు, గోద అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ వైస్ చైర్మన్ సోమా సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, మాజీ చైర్మన్ బండం దామోదర్ గుప్తా, మేడం సుధాకర్‌గుప్తా, వైస్ చైర్మన్ నాగమల్ల శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం

ఇబ్రహీంపట్నం రూరల్: ఎస్సీ వర్గీకరణే అంతిమ లక్ష్యంగా పని చేస్తామని ఎమ్మార్పీఎస్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్షుడు సిద్దాపురం శ్రీకాంత్ అన్నారు. ఆదివారం మండల పరిధి తులేకలాన్ గ్రామంలో సమితి గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోడ రాజు, ఉపాధ్యక్షుడిగా దయ్యాల దయాకర్, కార్యదర్శులుగా దర్శతేజ, సుధాకర్, కోశాధికారిగా దశరథ, ప్రచార కార్యదర్శులుగా సుర్జీత్, ప్రభాకర్, సలహాదారులుగా మహేందర్, విజయ్, స్వామి, అనిల్, కమిటీ సభ్యులుగా అజయ్, శివ,వి.మహేందర్,రాంచరణ్, మైసయ్య, రమేష్,నర్సింహ, జంగయ్య, అనిల్‌లను ఎన్నుకున్నారు.

కల్యాణం.. వైభోగం

మొయినాబాద్: వేదపండితులు మంత్రోచ్ఛరణలు.. మంగళవాయిద్యాలతో చిలుకూరు సురంగల్ భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. మండల పరిధిలోని చిలుకూరు సురంగల్ భ్రమరాంబ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 9 గంటలకు ధ్వజారోహణం, స్వామివారికి అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సంగెం మల్లేశ్ దంపతులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు దంపతులు కల్యాణోత్సవంలో కూర్చొని, స్వామివారి కల్యాణం జరిపించారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ఆవరణ కిక్కిరిసిపోయింది.

కాలనీల్లో కార్పొరేటర్ పర్యటన



కార్పొరేటర్ దీపికను సన్మానిస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్ పలు కాలనీల్లో స్థానిక కార్పొరేటర్ బోయపల్లి దీపికాశేఖర్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. కాలనీల్లో ఉన్న రోడ్డు, డ్రైనేజీ ఇతర మౌలిక సదుపాయాలపై ఆయా కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వినాయక హిల్స్ కాలనీవాసుల విన్నపం మేరకు గతంలో నాలుగు రోజులకొకసారి తాగునీటి కృష్ణా జలాలు వచ్చేవని, అవి అవసరాలకు సరిపోవడం లేదని తెలిపిన వెంటనే జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి చొరవ తీసుకోవడంతో నేడు వినాయకహిల్స్ కాలనీకి రోజు విడిచి రోజు కృష్ణానీరు వచ్చేలా చేశారన్నారు. ఈ విషయంలో కాలనీవాసుల తరఫున ఎమ్మెల్యే సబితారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా వినాయకహిల్స్ కాలనీలోని రోడ్ నంబర్ 6, 7, 8లో బీటీరోడ్లు మంజూరైనట్లు తెలిపారు. సంక్రాంతి పర్వదినాలు ముగిసిన వెంటనే రోడ్డు పనులు మొదలు పెట్టనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కార్పొరేటర్ దీపికను కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, అసోక్ కమిటీ సభ్యులు, కాలనీవాసులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కాలనీకి రోడ్లను మంజూరు చేయించి, తాగునీటి సమస్యను తీర్చిన ఎమ్మెల్యే సబితారెడ్డికి కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రవేశ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలి



గురుకుల కామన్ ఎంట్రెన్స్ పరీక్ష వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఉపాధ్యాయులు

చేవెళ్ల: పేద, మధ్య తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల కామన్ ఎంట్రెన్స్ పరీక్ష పోస్టర్‌ను గురుకుల ఉపాధ్యాయులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ విద్యార్థులకు 5 నుంచి 9వ తరగతుల ప్రవేశాల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న కామన్ ఎంట్రెన్స్ పరీక్షకు అర్హులందరూ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అన్ని వసతులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు గురుకుల పాఠశాలలను ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్రంలో చేనేత కార్మికుల సంక్షేమం కోసం, భరోసా, భద్రతా పథకాలు, త్రిఫ్ట్ ఫండ్ కోసం రూ.163 కోట్ల నిధులు విడుదల చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చిత్రపటాలకు పద్మశాలి సంఘం ఎల్బీనగర్ సర్కిల్ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ ఆర్‌కేపురం అధ్యక్షుడు పున్న గణేష్ నేత ఆధ్వర్యంలో ఆదివారం ఆర్‌కేపురంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పున్న గణేష్ నేత మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నం పెట్టే రైతన్న, నేతన్నలను రుణమాఫీ ప్రకటించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. చేనేతకు ప్రత్యేక ముద్ర సిల్క్ వస్త్రాలకు సిల్క్ మార్క్, చేనేత వస్త్రాలకు హ్యాండ్లూమ్ మార్కును ప్రత్యేకంగా ముద్రణ రూపొందించిన తొలి రాష్ట్రం తెలంగాణ ప్రభుత్వం అన్నారు. కార్యక్రమంలో రవి కుమార్, తలారి రమేష్ నేత, జిల్ల జగన్నాథం, భోగ జగదీష్, సంఘం రమేష్, నర్సింగ్, కళ్యాణ్, ప్రవీణ్ కుమార్, శివ పాల్గొన్నారు.